# మైకు వీర చేపరా !

వేదికలెక్కి ఉపన్యాసాలు దంచడం పెద్ద ఆర్ట్. అది అందరి వల్లా అయ్యేపని కాదు. ఆటగాళ్ళు , పాటగాళ్ళు , రచయితలు వాళ్ళ వాళ్ళ రంగాల్లో నిష్ణాతులు కావచ్చుగాక, మైకు పుచ్చుకుని రెండు ముక్కలు చెప్పమంటే తెలుస్తుంది సత్తా ఏమిటో ! మొట్టమొదటి సారిగా స్టేజీ ఎక్కినప్పుడు కాళ్ళు వొణకుతాయ్. శరీరం నీళ్ళు కారిపోతుంది. మాటలు తడబడతాయి. సన్మానసభలో విచారిస్తున్నాని, సంతాప సభలో చాలా ఆనందంగా వుందని అనటం జరుగుతుంది. మా ఆఫీసులో ఒకసారి ఇలాగే అలవాటు లేని ఆఫీసరు గారిని సంతాప సభలో మాట్లాడమంటే – ' ఇంత తక్కువమంది హజరు కావటం విచారంగా వుంది, మళ్ళీసారి పెద్ద సంఖ్యలో వస్తారని ఆశిస్తున్నా ' నన్నారు. అది ఆయన తప్పు కాదు. మాట్లాడటంలో అనుభవం లేకపోవటం చేత కలిగే ప్రమాదాలు. అంచేత నన్నడిగితే ప్రతి వ్యక్తి కాస్తో కూస్తో ఉపన్యాసం చెప్పటంలో అనుభవం సంపాదించటం మంచిది. దానికి సయంకృషి చాలా అవసరం. రోజూ ఓ గంట తలుపులన్నీ వేసుకుని గదిలో మీ ఇష్టం వచ్చినదాన్ని గురించి ఉపన్యాసం చెప్పండి. పచ్చళ్ళ గురించి, పక్కింటి పిన్ని గారి గురించి, సిటీ బస్సుల గురించో ,పంటి నొప్పి గురించి – ఇలా వస్తువు ఏదైనా ఆపకుండా మాట్లాడటం మొదటి మెట్టు. ఆ తర్వాత అస్సలు మీకేం తెలీని వస్తువు గురించో లేక అసహ్యమైన సంఘటన గురించో పొగుడుతూ మాట్లాడటం రెండో మెట్టు. మీకు పరిచయం లేని వ్యక్తిని గురించి మాట్లాడమని మిమ్మల్ని అడిగినపుడు ఈ విద్య మీకు మెండిగా పనికొస్తుంది. మీ మీద మీకు ధైర్యం వచ్చాక , పదిమంది పిల్లల్ని పోగుచేసి మీటింగు పెట్టండి .....అక్కడ గూడా విజయం సాధిస్తే అవకాశం వచ్చినప్పుడు. మొదటిసారి సంతాప సభలో మాట్లాడండి. ఎంచేతంటే, మీరు మాటలకోసం తడుముకున్నా , నేల చూపులు చూసినా మాట్లాడలేక సతమతమౌతున్నారనుకోరు. చనిపోయిన వ్యక్తి సద్గుణాలు గుర్తుకొచ్చి నోట్లోంచి మాట రావడం లేదనుకుంటారు. ఆ తర్వాత సర్దాగా ఒక సన్మాన సభ ట్రయిచేయండి . ఇహ మీకు తిరుగులేదు. ..... మిమ్మల్ని ఆ పరమాత్ముడు కూడా ఆపలేడు. మీ బారినించి మమ్మల్ని కాపాడనూలేడు.

ప్రతి ఊళ్ళోనూ మాట్లాడటంలో ఆరితేరిన ఘనాపాటీలు ముగ్గురో, నలుగురో వుంటారు. ఏ సభలో అయినా వాళ్ళే కనిపిస్తారు. అవే మాటలు చెప్తుంటారు. వాళ్ళకి సంతాప సభలు , సన్మాన సభలు ఒక్కటే – పెద్ద తేడా వుండదు. సన్మానితుడ్ని అడ్డం పెట్టుకుని తమని తాము పొగుడుకుంటారు. కీర్తిశేషుడిని గురించి కాక కొత్త మంత్రివర్గం గురించి అనర్గళంగా చెప్పి, ఈ మంత్రివర్గాన్ని అభినందించే అదృష్టం లేకుండాపోయిన ఫలానా చనిపోయిన వ్యక్తి గురించి చింతిస్తున్నానంటూ కూర్చుంటే పనయిపోతుంది. ఎవరినన్నా పొగడాలన్నా, తెగడాలన్నా చక్కటి పదునైన కత్తి ఉపన్యాసం !

ఈ మధ్యన ఒక విశిష్ట వ్యక్తి మనకున్న ఉపన్యాస ఘనాపాటిలని ఇంటర్వ్యూ చేశాట్ట. తమ తమ అనుభవాలని , విజయ రహస్యాలని వాళ్ళిలా చెప్పారట. నా ముందు కూర్చున్న ప్రేక్షకులు నాకన్నా చవటలనీ, ఎందుకూ పనికిరాని పరమ సన్నాసులని నే గట్టిగా అనుకుని ఉపన్యాసం ప్రరంభిస్తానని ఒకాయన అంటే – అసలు మాట్లాడేటప్పుడు నేను అటూ ఇటూ చూడకుండా , సభలో కూర్చున్న నా వైఫ్ వంకే చూస్తూ , మా ఇంట్లో అనుభూతికి లోనవుతానని ఇంకోరన్నాట్ట. మీరు గమనించారో లేదో గానీ, నే ఉపన్యాసం ప్రారంభించేముందు కళ్ళజోడు తీసి చేత్తో పుచ్చుకుంటా అంతే ఇహ నాకేం అనిపించదు. అంచేత బయపడకుండా గడగడా మాట్లాడేస్తానని ఇంకోరన్నారట. ఇవన్నీ వాళ్ళ జయ రహస్యాలు.

కాని ఇంకో ప్రమాదం గూడా వుంది. రోజూ ఉపన్యాసాలు దంచటం అలవాటయితే , ఒకరోజు మిస్సయితే , నరాలు జివ్వున గుంజి, దవడలు నొప్పిపుడతాయ్, అపుడు ఇంట్లోనే భార్యని , పిల్లల్ని , పనివాళ్ళని కూర్చోపెట్టి, ‘ సభకు నమస్కారం ’ అంటూ మీటింగు పెడితేనే గాని అన్నం సహించదు, నిద్ర రాదు, అంచేత జాగ్రత్త మరి !

------- అయ్యిపోయింది -------